ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ డివిజన్‌లో పేదల బస్తీలు ఎక్కువగా ఉన్నాయని, తాను కేంద్ర మంత్రిగా నియమితులైన నాటి నుంచే గుడిమల్కాపూర్ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించాన్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం తనను ఎప్పుడు కోరుతుండే వారని ఆయన గుర్తు చేశారు. ఆయన కోరికలను మన్నించి తాను డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలతో పాటు ఇంకా ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వందలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్‌లు, చారిత్రక ప్రదేశాల్లో అత్యాధునిక సాంకేతిక పద్ధతులో ప్రజలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాచీన చరిత్ర తెలియజెప్పడానికి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ మరో వైపు ప్రాచీన ఆలయాలను కూడా అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా సెంట్రల్ అధ్యక్షుడు గౌతమ్‌రావు, హైదరాబాద్ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండుయాదవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ, నాంపల్లి కన్వీనర్ పవన్‌కుమార్, రాహుల్ చంద్రా, బుజేందర్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలి..

పార్టీ అభ్యర్థుల విజయం కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ అభ్యర్థుల విజయం పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రచారంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. దేవర శ్రీనివాస్, దేవర వంశీ, అశ్విన్, రాధాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం...

నాంపల్లి: నియోజకవర్గంలోని బస్తీల పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆసిఫ్‌నగర్ హుడా కాలనీ సూరజ్ గార్డెన్స్‌లో పవర్ బోరును ప్రారంభించారు. గుడిమల్కాపూర్ ఉషోదయ కాలనీలో ఫుట్‌పాత్ డెవలప్‌మెంట్ పనులు, వీడీసీసీ రోడ్లను, గుడిమల్కాపూర్ సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి రాహుల్‌చంద్ర, నేతలు భుజందర్‌రావు, విజయ్‌సింగ్, డీఎంసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్థానిక క్యాడర్‌పై నారాజ్..

నియోజకవర్గంలో ఒక డివిజన్‌కు కూడా బీజేపీ కార్పొరేటర్ లేరు. అలాగే మనకు స్థానికంగా ఎమ్మెల్యే లేరు. వీరు లేనందునే నీకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించా. వీధి లైట్ల మరమ్మతులకు కూడా కేంద్ర మంత్రి వచ్చి జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడటం సవ్యంగా లేదు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లకుంటే, తీసుకెళ్లిన సమస్యలను పదేపదే వారికి గుర్తు చేయకుంటే సమస్య ఎలా పరిష్కారం అవుతుంది. వీధిలైట్లు లేవంటూ కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఉన్న నా దృష్టికి తీసుకురావడం సహేతుకంగా లేదు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో లేని నాయకులు పార్టీలో ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనని, తమ పద్ధతిని మార్చుకోవాలని నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి రాహుల్‌చంద్ర, మరో బీజేపీ నేత కొల్లూరు పవన్‌కుమార్‌కు తలంటు పోశారు.

బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్‌ను కలిసిన మమతాగుప్తా



అబిడ్స్: నగరానికి వచ్చిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరేత్‌విన్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సంతోష్‌గుప్తా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నగరం ఎలా అభివృద్ధి చెందిందో ఆయనకు వివరించారు. ప్రపంచస్థాయిలో హైదరాబాద్ నగరానికి కేటీఆర్ హయాంలోనే పలు అవార్డులు లభించాయన్నారు. విశ్వవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కేటీఆర్‌తోనే లభించిందని ఆయనకు మమతా గుప్తా, సంతోష్‌గుప్తా వివరించారు.

సావెళ్ల మహేందర్‌కు సన్మానం


సావెళ్ల మహేందర్‌ను సత్కరిస్తున్న బీజేవైఎం కన్వీనర్ సోమరాజ్‌సింగ్

అబిడ్స్: బీజేవైఎం తెలంగాణ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సావెళ్ల మహేందర్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం కన్వీనర్ సోమరాజ్‌సింగ్ సన్మానించారు. సోమవారం అబిడ్స్ కట్టెల మండిలోని బీజేపీ కార్యాలయంలో ఆయనను సత్కరించి సోమరాజ్‌సింగ్ అభినందనలు తెలిపారు. సోమరాజ్‌సింగ్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నలుమూలలా హైదరాబాద్‌తో పాటు 17 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బైసా దేవదాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గజల్ కవయిత్రి రాజా వాసిరెడ్డి రచించిన మోహన మహోత్సవం పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేటినిజం దినపత్రిక సంపాదకులు బైసా దేవదాస్ మాట్లాడుతూ..గజల్ చరిత్ర, ఘనత, తెలంగాణలో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ బిక్కి కృష్ణ, కవి రాజగోపాల్, గజల్‌కవి సూరారం శంకర్, కవయిత్రి శశిబాల, సంస్థ వ్యవస్థాపకురాలు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగా మైత్రి ప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని గౌతమ్‌మోడల్ స్కూల్, కల్కి హెచ్‌ఆర్ సొల్యూషన్స్ తదితర సంస్థల్లోని వంద ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, బీఈడీ విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలు 83284 28933లో సంప్రదించవచ్చు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


సమ్మె నోటీసులు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చాంద్రాయణగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి కిషన్ విజ్ఞప్తి చేశారు. చాంద్రాయణగుట్టలోని కుటీర పరిశ్రమలలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని రంగాల పట్ల వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్, రంగనాయకులు, వీరన్న, మల్లేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన బీజేపీ నేతలు



చార్మినార్: చార్మినార్ బీజేపీ నాయకులు సోమవారం ఉదయం రోడ్డు మార్గం ద్వారా అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. చార్మినార్ బీజేపీ కన్వీనర్ సురేందర్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది నాయకులు, కార్యకర్తలు పాతబస్తీ నుంచి బయలుదేరి వెళ్లారు. ముందుగా బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేంద్ర ఆధ్వర్యంలో కాళభైరవ హనుమాన్ ఆలయంలో జరిగిన పూజల్లో అయోధ్యకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉమామహేంద్ర మాట్లాడుతూ.. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం బాలరాముని ప్రాణ ప్రతిష్ట అనంతరం పాతబస్తీ నుంచి పెద్ద ఎత్తున శ్రీరాముని దర్శనం కోసం వెళుతున్నామన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా నూతన కోర్సులు

యాకుత్‌పురా: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలకు కల్పించేందుకు ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మరిన్ని నూతన కోర్సులను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నమని ప్రభుత్వరంగా సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ కే. వేణుగోపాల్ రావు తెలిపారు. సోమవారం ఆయన పురనీహవేలీ, మోతీగల్లీలోని సంస్థ కేంద్రాలలో ప్రముఖ సాంకేతిక నిపుణుల సహకారంతో ప్రవేశపెట్టిన బేసిక్ బయో మెడికల్ ఇక్విప్‌మెంట్ టెక్నీషన్, ప్లంబింగ్, టూల్స్ అండ్ కంపోనెంట్స్, ఫైర్ అలారం కంట్రోలర్, స్మోక్ డిటెక్టర్స్ కోర్సులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..మొదటి సారిగా ప్రవేశ పెట్టిన మూడు నెలల కాలపరిమితి ఈ కోర్సులను ప్రస్తుతం మోతీగల్లీ కేంద్రంలో మాత్రమే అందుబాటులోకి తెచ్చామన్నారు. అకౌంట్స్ అధికారి సురేష్ బాబు, అధికారులు అసిం ఎజాజ్, షేక్ హుస్సేనుద్దీన్, కలీముల్లా, మహ్మద్ ఇబ్రహీం సిద్దీఖీ, సయ్యద్ ఇర్ఫానుద్దీన్, సయ్యద్ అబ్దుల్ ఖాదర్, ఉద్యోగులు నవీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గోల్కొండ: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు మందులు అందించడమే తమ లక్ష్యమని సహాయత ట్రస్ట్ డైరెక్టర్ సయ్యద్ హనీసుద్దీన్ అన్నారు. ఐఎంఆర్‌సీ, ఇండో యూఎస్ మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి వారి సహాయంతో సోమవారం గోల్కొండ నయాఖిలాలోని ఉర్దూ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పదేళ్లుగా నగరంతో పాటు నగర శివారుల్లో ఉన్న ఊళ్లల్లో సహాయత ట్రస్ట్ తరఫున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 12 మంది వైద్యులు 350 మందిని పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఘూరీ, సోయబ్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి ఆగాపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని తోప్‌ఖానా, మాలకుంట, సీనా హోటల్ లేన్, రిజిస్ట్రార్ కార్యాలయం, కరాచి బేకరి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, పెన్‌పీటీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వి ఫైర్ స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పత్తర్ మజీద్, పుత్లీబౌలి చౌరస్తా, రామ్‌మందిర్, గౌలిగూడ, గోల్డెన్ ప్రెస్, గౌలిగూడ టెలిఫోన్ ఎక్చెంజ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నాంపల్లి, విజయ్‌నగర్ కాలనీ ఫీడర్ల పరిధిలోని నాంపల్లి, టేక్డి మసీద్, అల్లందుల్లా హోటల్, హబీబ్‌నగర్, అఫ్జల్ సాగర్, బజార్ ఘట్, నాంపల్లి ఆస్పత్రి, విజయ్‌నగర్ కాలనీ బస్‌స్టాప్ ప్రాంతాలు, ఫుడ్‌వరల్ పరిసర ప్రాంతాలు, లక్కీ కిరాణా జనరల్ స్టోర్, మిల్క్ బూత్ పాత, కొత్త పరిసర ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 11కేవీ హుమయూన్‌నగర్, ఎస్‌ఎండీసీ ఫీడర్ల పరిధిలోని హుమయూన్ నగర్, మెహిదీపట్నం, ఎంఐజీహెచ్, శ్రీరాంనగర్, మురాద్‌నగర్, హాకీ గ్రౌండ్, మాసబ్‌ట్యాంక్, యూనివర్సల్ బేకరీ, ఆంధ్రాబ్యాంక్, జేఎన్‌టీయూ వెనుక ప్రాంతాలు, శాంతినగర్, కాస్టిల్ హిల్స్, ఎన్‌ఎండీసీ, విజయ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

దుండిగల్ వినయ్‌రాజ్‌కు పురస్కార ప్రదానం



గన్‌ఫౌండ్రీ: పౌరాణిక పాత్రలు చేయడంలో దుండిగల్ వినయ్‌రాజ్ ఈ తరానికి దొరికిన సినీ ఆణిముత్యమని ప్రముఖ సినీ నిర్మాత సత్యనారాయణ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు దుండిగల్ వినయ్‌రాజ్‌కు బంగారు నంది పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు ఎస్.సరోజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న విరించి హాస్పిటల్స్ చైర్ పర్సన్ మాధవీలత

జియాగూడ: పురాతన ఆలయాలను పరిరక్షించడంతో పాటు అభివృద్ధి చేయాలని విరించి హాస్పిటల్స్ చైర్‌పర్సన్ మాధవీ లత అన్నారు. సోమవారం జియాగూడలోని సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో సుమారు 400 ఏళ్లకు పైబడిన పురాతన ఆలయాలు ఎన్నో శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని కాపాడి అన్ని విధాలా అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సనాతన ఆలయాల పరిరక్షణ సమితి చైర్మన్ పి.యాదగిరి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు టి.యమన్ సింగ్, కోశాధికారి సీహెచ్. కాశిబుగ్గ బాబన్న, కార్వాన్ అధ్యక్షులు చంద్రశేఖర్, మంకాల శ్రీరాములు పాల్గొన్నారు.

అభినందనలు



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి బాధ్యతలు చేపట్టిన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలియజేసినట్లు టీపీసీసీ మాజీ కార్యదర్శి, గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు తెలిపారు. న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారన్నారు.

నియామకం


నియమాక పత్రాన్ని అందుకుంటున్న శివచంద్రగిరి

గౌలిపురా: నెహ్రూ యువ కేంద్ర జిల్లా అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా పాతబస్తీ గౌలిపురాకు చెందిన అల్లి శివచంద్రగిరి నియమితులయ్యారు. నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా సోమవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శివచంద్రగిరి మాట్లాడుతూ..తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశ్రీ గడ్డం సమ్మయ్యకు సన్మానం


పద్మశ్రీ గడ్డం సమ్మయ్యను సత్కరిస్తున్న రాకేష్ జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సోమవారం బీజేపీ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి నవీన్ బండారి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భారత ప్రభుత్వం వివిధ రంగాల్లో కృషి చేసిన వ్యక్తులను గుర్తించి పద్మశ్రీ అవార్డులను అందజేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. పద్మశ్రీ అవార్డు పొందిన వ్యక్తులకు సమాజంలో ఉన్నతమైన గౌరవం లభిస్తుందన్నారు.

గోషామహల్ అభివృద్ధికి బీఆర్‌ఎస్ కృషి


ఆనంద్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ప్రభుమిత్ర సేవా సంఘ్ అధ్యక్షుడు రమేష్ తదితరులు

అబిడ్స్: గోషామమల్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తోందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పదేళ్లల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సోమవారం ప్రభుమిత్ర సేవా సంఘం అధ్యక్షుడు రమేష్, ఇతర నాయకులు ఆర్టీసీ రాజు, శేఖర్, రంజిత్, వెంకటేష్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని బేగంబజార్ గౌలిగూడ ప్రాంతాల్లో నీటి సమస్యల గురించి వివరించారు. వెంటనే ఆనంద్‌కుమార్ గౌడ్ సంబంధిత వాటర్‌వర్క్స్ జీఎం జాన్ షరీఫ్‌తో మాట్లాడి తాగునీటి సమస్యను వెంటనే తీర్చాలని పేర్కొన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోకుండా కుల మతాలకు అతీతంగా పని చేస్తుందని.. ఇలాగే రాబోయే కాలంలో కూడా పని చేసే విధంగా ప్రభుత్వానికి లక్ష్మీ నర్సింహస్వామి ఆశీస్సులు ఉండాలని కోరుతూ యాదాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు జరుగుతాయన్నారు.

నేడు మెగా హెల్త్ క్యాంప్

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 30న అవేర్ గ్రూఫ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అవేర్ గ్రూఫ్ డైరెక్టర్ జనరల్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మహేశ్వరంలోని భగవతిపురంలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంపులో సుమారు 5 వేల మందికి పైగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కె.నర్సింహారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు సంజన, సీతారామయ్య, వెంకట్‌రెడ్డి రమాకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ఎస్.కుమార్‌కు డాక్టరేట్



గన్‌ఫౌండ్రీ: మనం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.ఎస్.కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రిసర్చ్ యూనివర్సిటీ ఆయనకు సోమవారం గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. స్ఫూర్తి ఎన్జీఓ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆకుల రమేష్, నర్సింహారావు, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ ఫంక్షనల్ బయాప్సీ గన్ పరీక్షల అనుమతిపై హర్షం


డాక్టర్ రవితేజ

నాంపల్లి: ఏకకాలంలో బయాప్సీ ద్వారా ఊపిరితిత్తుల్లో చేరిన నీటిని, కేన్సర్ కణాలను తొలగించే మల్టీ ఫంక్షనల్ బయాప్సీ గన్ పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంపై నిలోఫర్ ఆసుపత్రి రేడియాలజిస్ట్ డాక్టర్ రవితేజ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా చేస్తున్న శ్రమకు నేడు తగిన ఫలితం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలు చేయాలంటే ఒక్కొక్కరికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. నిలోఫర్ ఆసుపత్రికి పేటెంట్ ఆఫ్ అప్రూవల్ లభించడం సంతోషంగా ఉందన్నారు.

సత్కారం


వివేక్ వెంకటస్వామిని సత్కరిస్తున్న మీర్జా మోహిబ్ బేగ్

నాంపల్లి: చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వివేక్ వెంకటస్వామిని పలువురు కాంగ్రెస్ మైనార్టీ నేతలు అభినందించారు. మాసబ్‌ట్యాంక్‌లోని ఎంఎం బ్యాంకెట్ హాల్‌లో చెన్నూరు ఎమ్మెల్యేకు ఆత్మీయ అభినందన సత్కార సభ జరిగింది. సీనియర్ కాంగ్రెస్ నేత మీర్జా మొహిబ్ బేగ్ అధ్యక్షతన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, అతని కుమారుడు వంశీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మీర్జా జావెద్ బేగ్, మీర్జా సాజిద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

లంగర్‌హౌస్: కాంగ్రెస్ పార్టీని నమ్మిన వారికి పార్టీ ఎల్లప్పుడూ న్యాయం చేస్తుందని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు కె.చంటిబాబు అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, కమిటీల నియామకాలపై గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం లంగర్‌హౌస్‌లో కార్వాన్ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శిగా నాగులపల్లి శ్రీకాంత్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కృష్ణ, పరమానందం, రఘుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తరలించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: చెత్త పాయింట్ల నుంచి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ ఖైరతాబాద్ జోనల్ ఆఫీసర్ రవినాయర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన చెత్త తరలింపుపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టితో ఉంచుకొని చెత్త తరలింపు పనులు అధికారులు ప్రతి నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. టోలిచౌకీ, గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్‌లలో చారిత్రక ప్రదేశాలకు ఆనుకొని కందకాలు, ప్రహరీ గోడలు చెత్త డంపింగ్ యార్డులు మారాయని ఆయన అన్నారు. చెత్తతో పాటు ఇతర వ్యర్థాలు డంపింగ్ అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎల్-2 అధికారి బాలరాజ్, సర్కిల్ ఇన్‌చార్జి మురళీచక్రవర్తి, డబ్ల్యూఎఫ్‌ఏ తోకటి వినోద్‌కుమార్, సాయికుమార్ తదితరులున్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

యాకుత్‌పురా: యాకుత్‌పురాను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్ చంచలం డివిజన్‌లోని భవానీనగర్, తలాబ్‌కట్టా, నషేమాన్ నగర్ ప్రాంతాల్లో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను సోమవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగం, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిరోజూ బస్తీల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ పనులు, కమ్యూనిటీ హాల్, నాలాల విస్తరణ పనులను చేపట్టామన్నారు. అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.


ఎస్సీ వర్గీకరణ బిల్లును పాస్ చేయాలి



మాట్లాడుతున్న బ్రహ్మయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం మాదిగలను పూర్తిగా మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ ఆల్ ఇండియా అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, మాదిగల సంక్షేమం, రాజకీయ రంగాల్లో వాటాకై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సోమవారం హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వాలు గతంలో ఎన్నో కమిటీలు వేశాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వానికి మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో వర్గీకరణ బిల్లును పాస్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో డాక్టర్ నంద్రు నర్సింహ, ఓదేలు, బండపల్లి రాజన్న, జగన్, నర్సింహ, ధర్మేందర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కరణ్‌కుమార్‌కు నివాళి




గోల్కొండ: బీజేపీ సీనియర్ నాయకుడు దివంగత కరణ్‌కుమార్ కామ్లేకర్ మొదటి వర్ధంతి సోమవారం గుడిమల్కాపూర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి అమర్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. సచిన్ కామ్లేకర్, దేవర వంశీ, శ్రీకాంత్‌సాగర్, రాధాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

కత్తితో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి జైలు

దబీర్‌పురా: కత్తితో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూర్‌ఖాన్‌బజార్‌లో సోమవారం సాయంత్రం ఏఎస్సై శివరాములు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా..సయ్యద్ రజా (21) అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకొని తనిఖీలు చేయగా కత్తి లభించింది. దీంతో సయ్యద్ రజా పోలీసుల విచారణలో సరైన సమాధానం చెప్పకపోవడంతో సయ్యద్ రజాను నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ సయ్యద్ రజాకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో అన్నదానం



అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్‌జే ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. దాదాపు 500 మందికి మాంసాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..సమాజ సేవకు నిరంతరం కృషి చేస్తానన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ట్రస్టును ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, వైదిక్ శాస్త్రి, బి.శంకర్, శ్రీధర్‌నాయుడు, కోశాధికారి శేఖర్, మహ్మద్ వహీద్, ముస్తఫా, షరీఫ్, హబీబ్ చావూష్ తదితరులు పాల్గొన్నారు.